క్లుప్తంగా

మృతుని కుటుంబానికి రూ. 1.30 లక్షల సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: పాడుగుపాడు గ్రామానికి చెందిన మెట్ట మాధవరావు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. నిరుపేద కావడంతో గ్రామస్తులు, స్థానికంగా ఉద్యోగులు ఆదుకోవడానికి ముందుకొచ్చారు. ఒక లక్షా ముప్పై నాలుగు వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ నూక సత్యరాజ్, ఎంపీటీసీ సభ్యుడు సింగూరు వాసు, ఫీల్డు అసిస్టెంటు సోమేశ్వర రావు మాధవరావు కుటుంబు సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మెట్ట పాపారావు, రామారావు, గడ్డయ్య, అన్నెపు భాస్కరరావు, టి.చిన్నప్పన్న పాల్గొన్నారు.

చంద్రమోహన్ మృతిపై సంతాపం

టెక్కలి: సీనియర్ సినీనటుడు చంద్రమోహన్ మృతిపై స్థానిక సుదర్శన్ థియేటర్ యాజమాన్యం శనివారం సంతాపం తెలియజేసింది. యజమాని సత్తారు వెంకటరమణ ఆధ్వర్యంలో చంద్రమోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కళా సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ ఎస్.బాల, సిబ్బంది గురివి నాయుడు, మహాపాత్రో, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: చంద్రమోహన్ మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని కొత్తమ్మతల్లి కళానాటక మండలి సభ్యులు పూజారి లక్ష్మణరావు, లఖినేని కరుణ్‌కుమార్, నౌపడా హరిప్రభాకర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

వైష్ణవ ఆలయాల్లో భక్తుల రద్దీ



బెజ్జిపుట్టుగలో పూజలందుకున్న చక్రధర పెరుమాళ్లస్వామి

కవిటి: మండలంలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో శనివారం సందర్భంగా భక్తుల రద్దీనెలకొంది. ఇందులో భాగంగా లొళ్లపుట్టుగలోని కల్యాణ వేంకటేశ్వర, బెజ్జిపుట్టుగలోని చక్రధర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. విష్ణుసహస్ర నామ సామూహిక పారాయణం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరిపంటపై అడవి పందుల దాడి



అడవిపందుల దాడిలో ధ్వంసమైన వరిచేను

కవిటి: వరిపంటపై అడవిపందుల గుంపు దాడి చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోంపేట మండలం నుంచి కవిటి, ఇచ్ఛాపురం మండలాల వరకు గల బీల ప్రాంతంలో ఈ ఏడాది ఆపసోపాలు పడి రైతులు ఖరీఫ్ వరిపైరు సాగుచేశారు. వర్షాలు లేకపోవడంతో కేవలం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సాయంతో సాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయా మండలాల పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో పంట వెన్ను దశలో ఉంది. ఈ పరిస్థితిలో అడవి పందులు పంటపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. దీంతో ఉన్న కొద్దిపాటి పంట కూడా చేతికి వస్తుందో..లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సోంపేట: ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మొగిలి కొత్తూరు వసతి గృహంలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు, గ్రామస్తులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వసతి, భోజనాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ నగిరి ప్రభావతి, వార్డు మెంబర్లు మల్లా వెంకటరమణ, తోట ఢిల్లీ, పి.గిరి, పొందర లోకనాథం ఉన్నారు.

15న మందసలో రైతుల ధర్నా

మందస: మందస పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ నెల 15 ధర్నా నిర్వహిస్తున్నట్టు చైతన్య, మహేంద్ర రైతు సంఘాల అధ్యక్షుడు మామిడి మాధవరావు, బెస్త కామేశ్వరరావులు చెప్పారు. కరువు మండలాల సాధనకు, రైతాంగ సమస్యలు పరిష్కారానికి ఈ ధర్నా నిర్వహిస్తున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వెలుగుల పండుగకు వేళాయె..

చిన్నా..పెద్దా..తారతమ్యం లేకుండా అందరూ జరుపుకునే పండుగ దీపావళి. వెలుగుల పండుగగా పిలిచే దీన్ని సంతోషంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఆదివారం జరుపుకునే దీపావళి కోసం బాణసంచా దుకాణాలు, ప్రమిద విక్రయ కేంద్రాలు, ఇతర దుకాణాలు కొద్దిరోజుల నుంచి కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. అయితే పండుగకు ఒక్కరోజే సమయం ఉండడంతో శనివారం రోజంతా దుకాణాలన్నీ జనంతో కిటికిటలాడాయి. బాణసంచా విక్రయ దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు.



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బాణసంచా విక్రయ దుకాణం



వజ్రపుకొత్తూరు: పూండి మార్కెట్‌లో ప్రమిదల విక్రయం



కాశీబుగ్గ: కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీలో డబ్బా బాంబులను విక్రయిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: కాశీబుగ్గ మూడురోడ్ల కూడలి వద్ద పువ్వులు, పత్రి కొనుకలు చేస్తున్న జనం

సీఎం జగన్‌తోనే ఉజ్వల భవిష్యత్



కోటబొమ్మాళి: కొత్తవలసలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కంచిలి: బలియాపుట్టుగ కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణ

టెక్కలి: అన్నివర్గాలకు శతశాతం సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మనందరి భవిష్యత్ అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బగాది హరి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గ్రామసచివాలయం-4 పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు ఇచ్చారని అందుకే ఈ రాష్ట్రానికి జగన్ మళ్లీ సీఎం కావాలని వారు కోరారు. అనంతరం ఇంటింటా సంక్షేమ పథకాల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పి.హేమలత, వార్డు సభ్యుడు పి.రమణబాబు, నాయకులు జి.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కొత్తవలస సచివాలయం పరిధిలో శనివారం ప్రచారం చేశారు. మండల జేసీఎస్ ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ రాం పాత్రుని సావిత్రి, ఎంపీటీసీ సభ్యుడు దుక్క రామకృష్ణ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మద్దతు పలకాలని కోరారు.

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కంచిలి-2 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా బలియాపుట్టుగ కాలనీ, చీకటి కాలనీలలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేశారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల పాలనలో తేడాలను ప్రజలకు తెలియజేసి వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు యారడి ఆనందరావు, పార్టీ సచివాలయ కన్వీనర్లు ఎస్.జోగేశ్వర చౌదరి, ఎస్.శ్యాంప్రభ, బి.బిజు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మనందరి నమ్మకం, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. ఈదుపురంలో నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిగడపకు వెళ్లి 2014 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో అనే అంశాలపై కరపత్రం ద్వారా కుటుంబ సభ్యుల అభిప్రాయాలను సేకరించారు. జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాదరావు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, ఆశి కృష్ణారెడ్డి, ఇసురు తులసీరాం, గృహ సారథులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదు

- పోలీసుస్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు



ఆకతాయిలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిపక్ష నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ఈ నెల తొమ్మిదో తేదీన లొద్దపుట్టిలో ప్రారంభమైన నేపథ్యంలో స్థానిక గ్రామ సచివాలయం వద్ద 'సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డు'ను ఏర్పాటు చేశారు. దీనిపై ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంపై శుక్రవారం రాత్రి ప్రతిపక్షానికి చెందిన వ్యక్తులు ఐరన్ మేకులతో గీసి..పాడుచేసి ఉండటాన్ని శనివారం స్థానిక పార్టీ నాయకులు గుర్తించారు. దీనిపై స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత ఏ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి నాలుగున్నరేళ్లలో జరగడంతో సహించలేని ప్రతిపక్షాలకు చెందిన వారు నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లకు అమర్చిన గాజు కిటికీలను సైతం పాడు చేస్తున్నారన్నారు. ఇటువంటి ఆకతాయి పనులకు స్వస్తి పలికి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కోసం కలసి రావాలని సూచించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో మండల వైస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు నీలాపు సారధిరెడ్డి, నర్తు వరప్రసాద్, సాడి గురుమూర్తి, పిట్ట బాలయ్య, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి ఉన్నారు.

విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

టెక్కలి: విద్యా విధానం కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు కోరారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం పీడీఎస్‌యూ జిల్లా 12వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో ఈ రంగం పూర్తిగా కార్పొరేటీకరణగా మారిందని ఆరోపించారు. దీని వలన ఫెడరల్ హక్కులను సైతం హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్‌ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులు, బొగ్గు గనులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి వై.సూర్యప్రకాశ్, డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.ధర్మారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వినోద్ కుమార్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, సునీల్, మహేష్, జీవన్, రాజేష్, ధర్మారావు పాల్గొన్నారు.

ఉద్దానం సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రకాశరావు

వజ్రపుకొత్తూరు: ఉద్దానంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్దానం ప్రజలు ఉమ్మడిగా సమరశీల పోరాటం సాగించాలన్నారు. మండలంలోని పూండిలో శనివారం స్థానిక రైతులు, ఉద్దానం ప్రాంత వాసులతో కలిసి మాట్లాడారు. పాలకులు మారుతున్నా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు. ఈ నెల 22వ తేదీన మర్రిపాడు గణపతినగర్‌లో నిర్వహించనున్న అమరవీరుల 45వ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నేత జి. బాలక్రిష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు పి.కుసుమ, పీవైఎల్ నేత సార జగన్, ఐఎఫ్‌టీయూ నేత బి.గోపి, అరుణోదయ నాయకుడు కుత్తం ఢిల్లీరావు, రైతు కూలీ సంఘం నాయకుడు రాపాక మాధవరావు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధి ఈశ్వరరావు

కాశీబుగ్గ: మాజీ సైనికులకు, వీర మాతలకు, వితంతువులకు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ప్రశన్న విఘ్నేశ్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యంతో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రిని సంఘ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. శ్రీకాకుళం హెడ్‌క్వార్టర్ నుంచి వచ్చిన ఈసీహెచ్ ఆస్పత్రి బాధ్యులు ఎం.నారాయణరావు, జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘ కెప్టెన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు, తమ్మినాన క్రిష్టారావులు మాజీ సైనికుల వైదయసేవలపై ఆస్పత్రి వర్గాలతో మాట్లాడారు. శ్రీకాకుళం, బరంపురం వంటి ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లకుండా ఇక్కడే వైద్యసేవలు అందితే మాజీ సైనిక కుటుంబాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. అనంతరం పలాసలోని మాజీ సైనికుల సంక్షేమ భవనంలో సమావేశం నిర్వహించి మాజీ సైనికు కుటుంబాల సంక్షేమంపై చర్చించారు. పలాస-కాశీబుగ్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళింగ వైశ్యులను బీసీ-డీ జాబితాలో చేర్చుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకొని, జీఓ జారీ చేయడం పట్ల కళింగ వైశ్య జిల్లా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నరసన్నపేట వైఎస్సార్ కూడలి వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ గతంలో కళింగ వైశ్యులను వైఎస్సార్ హయాంలో బీసీ జాబితాలో చేర్చారని, అది కొన్ని జిల్లాలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం జగన్‌ను కోరగా సానుకూలంగా స్పందించి తాజాగా అమలు చేశారని పేర్కొన్నారు. ఓబీసీలో చేర్చడానికి కూడా ఓబీసీ కమిషన్‌కు తగిన సమాచారం ఇచ్చారన్నారు. కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, ప్రతినిధులు పొట్నూరు సాయి ప్రసాద్, కేసీహెచ్‌బీ గుప్త, బోయిన బాలకృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, పొట్నూరు కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనం పరిశీలన

నందిగాం: నౌగాంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి వైద్యాధికారి పి.అంజలితో కలిసి శనివారం పరిశీలించారు. భవనంలో రోగుల కోసం కల్పించిన సౌకర్యాలు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసి నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. రూ.1.62 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రక్షణ గోడ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు బార్నాన బాలక్రిష్ణ, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, తమిరె దేవేంద్ర, హెచ్.ఎస్.సూర్యనారాయణ ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

కాశీబుగ్గ: గరుడఖండి గ్రామం వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం సంభవించింది. బెండి గేటు నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ సమయంలో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ఆటోలో ఉన్నారు. ఈ ఘటనలో పొందర ధమయంతి అనే మహిళకు కాలు విరిగిపోయింది. స్థానికులు గమనించి ఆటోలో ఉన్నవారిని బయటకు తీశారు. క్షతగాత్రురాలిని 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

మంత్రి సీదిరి పరామర్శ

వజ్రపుకొత్తూరు రూరల్: దేవునల్తాడ గ్రామానికి చెందిన గాలి రామలక్ష్మి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మంత్రి సీదిరి అప్పలరాజు శనివారం రాత్రి పరామర్శించి.. ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతురాలి కుమారుడు షణ్ముఖరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, సర్పంచ్ వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు చౌదాల వెంకన్న, గాలి శేషగిరి నాయుడు, భీమారావు రెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

'దున్న' కుటుంబానికి..

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దున్న ఢిల్లీరావు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను శనివారం మండల పార్టీ నాయకులు పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, ఈదుపురం, కేశుపురం సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావు, జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి ఉన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- దండుగోపాలపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. దండుగోపాలపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియడంతోపాటు నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపీపీలు పి.తులసమ్మ, నక్క చింతామణి, స్థానిక సర్పంచ్ మార్పు అశోక చక్రవర్తి, మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబూరావు, పార్టీ నాయకులు దువ్వాడ హైందవి, సంపతిరావు రాఘవరావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు ఉన్నారు.

104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి

టెక్కలి: తమ సమస్యలను పరిష్కరించాలని 104 వాహన సిబ్బంది కోరారు. ఈ మేరకు తమ సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని శనివారం టెక్కలిలో కలిసి కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందజేస్తున్నామని గుర్తు చేశారు. అయితే తాము కొన్ని రకాల సమస్యలను ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందజేస్తున్న సీఎం జగన్ తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని కృపారాణి హామీ ఇచ్చారు. డాక్టర్ కిల్లి రామ్మోహన్‌రావు, టీబీజీ గుప్తా ఉన్నారు.

మంత్రిని కలిసిన ఆపస్ ప్రతినిధులు

కాశీబుగ్గ: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సభ్యులు కోరారు. ఈ మేరకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, నాయకులు బందరు శంకరం, ఎం తారకేశ్వరరావు, కోళ్ల మల్లేశ్వరరావు, ఎల్.ధర్మారావు, బల్ల సత్యానంద ఉన్నారు.

కుక్కల దాడిలో 18 మేకలు మృతి

కోటబొమ్మాళి: కుక్కల దాడిలో 18 మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన యలమంచిలి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకోగా కొర్రాయి అప్పలరామయ్యకు చెందిన జీవాలు ప్రాణాలు కోల్పోయాయి. 30 మేకలను పగటి పూట మేతకోసం తీసుకెళ్లి సాయంత్రం తన ఇంటి పక్క స్థలంలో వలలో పెట్టి ఇంటికి చేరుకున్నాడు. అయితే రాత్రి ఎనిమిది గంటల సమయంలో వలపై నుంచి కుక్కలు దూకి మేకల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 15 మేకలు, మూడు పిల్లలు చనిపోగా.. మరో మూడు మేకలకు గాయాలయ్యాయి. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ శోభ, కురుడు పశువైద్యాధికారి కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.